
# అహం

డా. కె.వి.రమణారావు



ఇది ఇప్పటిదా? డెబ్బైయ్యేళ్ళ నాటి మాట.

★★★

రాయప్ప మేడమీద గదిలో కూర్చుని కిటికీలోంచి దూరంగా ఉత్తరం నుంచి దక్షిణంగా విస్తరించిన తూర్పుకొండల కేసి తదేకంగా చూస్తున్నాడు. పశ్చిమాన అప్పుడే దిగిపోతున్న సూర్యుడి కిరణాలు పడి తూర్పు కొండలు జ్వలిస్తున్నాయి.

కొండయ్య, ఎల్లారెడ్డి అప్పటికి పావుగంట నుంచి గదిలో ఎదురుచూస్తున్నారు. ఆయన్ని పిలవడానికే గాదు, చిన్న శబ్దం చేయడానికి కూడా ధైర్యం చాలడం లేదు. కదలిక లేని రాయప్పతో పాటు కాలం కూడా స్తంభించింది.

కాస్సేపటికి రాయప్ప తలతిప్పి వీరివైపు 'ఏం' అన్నట్లు చూశాడు.

''సుంకిగాడు దొరికినాడు దొరా. మధ్యాన్నం ఏదో పనిమీద ముంగిపల్లె కొచ్చినాడని తెలిసింది. ఇంతకుముందే మనోళ్ళు నలుగురు పోయి పట్టుకొచ్చి కాళ్ళు చేతులు కట్టేసి మన పాత బంగళా యెనకాల షెడ్లో పడేసినారు దొరా'' అన్నాడు కొండయ్య.

రాయప్ప మొహంలో తృప్తి ఓ చిన్న కెరటమై మెరిసి అంతర్ధానమైంది.

''కాళ్ళు చేతులు ఇరిసేసి వాణ్ణి పెన్నలో పడేస్తాం దొరా'' అన్నాడు ఎల్లారెడ్డి కోపంగా.

రాయప్ప తీక్షణంగా ఎల్లారెడ్డి వైపు చూశాడు.

''రేపు పొద్దున్న పంచాయతీ పెడ్తాం దొరా'' అన్నాడు కొండయ్య దొరగారి మనోగతాన్ని అర్థం చేసుకుని.

రాయప్ప కిటికీ వైపు తలతిప్పుకున్నాడు.

కొండయ్య, ఎల్లారెడ్డి నిశ్శబ్దంగా కిందికి దిగి వెళ్లిపోయారు.

★ ★ ★

''అదిగాదు మామా యీ సుంకయ్య జేసిన తప్పేంటీ. ఈ పంచాయితీకి మనకూ ఏం సంబంధం? మనం పనిమానుకుని ఇప్పుడీ పంచాయితీకేమిటికి బోతున్నట్టు? మా ఊరి యవ్వారమే నాకర్థంగాదు. మాకాడ ఇంతధ్వాన్నం గాదనుకో'' అన్నాడు రాజన్న వడివడిగా మామ ఓబయ్య వెంట నడుస్తూ.

ఉదయం తొమ్మిది గంటలవుతూంది. ఇద్దరూ డొంకారి వెంబడి రాయప్పగారి పెద్దూరి కేసి నడుస్తున్నారు.

''నువ్వు నోరుమూసుకోని రారా. ఎక్కువ మాట్లాడతాండావ్. ఎవరన్నా యింటే ముందు మన చర్మం చిట్లుతాది'' కంగారుగా అన్నాడు ఓబయ్య ఇటూ అటూ చూస్తూ.

''ఈడ యెవురుండారని మనం మాట్లాడుకునేది ఇనడానికి. పెద్దూరు ఇంగా శానా దూరముండాదిలే చెప్పు'' తన పంతం వదలల్లేదు రాజన్న.

''ఇందులో కొత్తేముండాది. ఇట్టాటియి మామూలే గదా. బద్వేలు గఫూర్ సాయెబు రాయప్ప దొర గారి మామిడితోటల కాపు ఈతూరి కొన్నాడు. చాలా వరకూ అమ్ముకున్నాక సాయెబుకు ఖాయిలా దగిలింది. ఈ సుంకయ్య సాయెబు పక్కూరోడే. మిగిలిన కాపుని మారుబేరానికి ఈ సుంకయ్య సాయెబు దగ్గర కొన్నాడు. అయితే కాయలమ్ముకున్నాక డబ్బులెగ్గొట్టి పారిపోయినాడంట. నిన్న దొరికినాడంట...అదీ పంచాయితి'' నడుస్తున్న ఓబయ్య గసపెడుతూ వివరించాడు.

''సరే అనుకో. ఇదేదో దొరకూ సుంకయ్యకు సంబంధించింది గదా చుట్టుపక్కల ఊర్లన్నిటికీ దండోరా యేసి అందర్నీ పిలిచి పంచాయితి బెట్టడమెందుకూ?'' రాజన్న అసలు సందేహం ఇంకా తీరలేదు.

డొంకదాటి ఇద్దరూ రహదారి ఎక్కబోతున్నాడు.

''ఎవడురా ఓబయ్యా ఈ పిల్లకాయ. నీ బామ్మరిదా. ఎప్పుడొచ్చినాడూ, గొంతు పెద్దదే'' మాటల వెనకనుంచి విన్పించి ఇద్దరూ ఉలిక్కిపడి చూశారు.

ఎగువపల్లె శివాలయం పూజారి చెంచన్నశాస్త్రి. అప్పుడే పక్కదారిలోంచి వచ్చి రహదారిలో కలుస్తున్నాడు. చెట్ల చాటు వలన కన్పించలేదు.

మామా అల్లుళ్లిద్దరూ నమస్కారం చేసి వినయంగా పక్కకు ఒదిగి నిల్చున్నారు.

''పంచాయతీకేనా, నేనూ అక్కడికే పదండి'' అంటూ ముందుకు నడిచాడు చెంచన్న.

''మా మేనల్లుడు సాములూ, రాజన్న. మా చిన్న చెల్లెలు పార్వతి కొడుకు పెద్దోడు. బద్వేలు కవతల చిన్నగూడెంలో ఉండారు. ఈడు కొన్నాళ్ళు యిస్కూలుకు బోయినాడు. సదువు రాలేదు గాని గొంతు వొచ్చింది''

''పార్వతి బాగుందిరా? ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. అప్పుడే ఇంత పెద్ద కొడుకా?'' అన్నాడు చెంచన్న.

''బాగుంది సాములూ. ఈడి యెనకాల ఇంగా ఇద్దరు బిడ్డలు. ఈడికి దూరమనేగాని దాని మొగుడికొక నాలుగెకరాల బూవసతుంది. ఏదో ఉన్న దాంట్లో పాట్లు పడతాండారు. బిడ్డల్ని యిస్కూలుకు గూడా పంపుతుండాది''

''మంచి మాట. మనకిక్కడ యిస్కూలు గూడ లేదుగదా. ఇంతకూ మేనల్లుడేమంటా ఉన్నాడు?''

''అది గాదు సామీ'' అంటూ రాజన్న ఏదో చెప్పబోయాడు.


''మీ మామకేందెలుసురా, చెప్పులు కుట్టడం, చేను దున్నడం దప్ప. నువ్వీ ప్రాంతానికి కొత్త. నే జెబుతా విను'' అంటూ ఓసారి అటూ ఇటూ చూసి వెంకన్న చెప్పడం ప్రారంభించాడు.

''రాయప్ప గారు ఈ తాలూకా కంతా మహారాజు. నాకు సరిగ్గా తెలీదుగాని అసలు వాళ్లది విజయనగరం రాజుల కింద పన్జేసిన పాలేగాళ్ళ వంశమని మా తాత అనేవాడు. ఆయనకు ఈ ప్రాంతంలో ఎక్కడెక్కడ ఎంతెంత భూముందో ఆయనకు, ఆయన శిష్యులకూ తప్ప కరణంగారికి కూడా తెలీదనుకో. భూములేనా, చెరువులు, తోటలు, దొడ్లు, బంగళాలు ఎన్నో. ఆయన ఊపిరి బిగబడ్తే ఈ ఫిర్కాలో గాలి ఆడదనుకో. జిల్లా బోర్డు మెంబరు. అది కూడా ఆయనడిగాడా? ఈయన సదువు, పెద్దరికం చూసి వాళ్ళే ఇచ్చారు. కలెక్టరైనా, కాంగ్రెస్ మినిష్టరైనా ఆయనింటికి వచ్చి పోవాల్సిందే గదా!'' ఆయాసపడుతూ చెప్పుకుపోతున్నాడు.

''ఆయన మొకమెంక ఎవడైనా కన్నెత్తి చూడగలడా తలకాయ దించుకుని మాట్లాడాల్సిందేగాని. ఆయన ఎవర్తోనైనా ఒకట్రెండు మాటలే మాట్లాడతాడు. అంతా కనుచూపులతోనే గ్రహించాలి'' చెంచన్న వగర్చాడు.

''మరంత పెద్దాయనకి ఈ చెప్పులు గుట్టుకునే సుంకయ్యతో పెంచాయతి ఏంది?'' రాజన్న సందేహం ఇంకా తీరలేదు.

''దొరవారు పరువు మర్యాదలకు ప్రాణం బెట్టే మనిషి. డబ్బు ఎంతున్నది గాదు సమస్య. దొర గారి డబ్బు ఎగ్గొట్టి పోవడం అంటే తమాషానా. ఆయన పరువుకు సంబంధించిన విషయంగాదూ. ఇప్పుడొదిలేస్తే రేపింకోడు జెయ్యడూ. అందులోనూ ఒక తక్కువ కులస్తుడు. పంచాయతీ పెట్టించి ఒక రెండు వేలు జరిమానా వేస్తే మళ్ళీ ఎవడూ ఇంట్లాంటి పనిచెయ్యడు. అందులోనూ న్యాయం ఆయన వైపున్నప్పుడు పంచాయతీయే మేలుగదా''.



''నువ్వు నోరు మూసుకోని రారా. ఎక్కువ మాట్లాడతాండావ్. ఎవరన్నా యింటే ముందు మన చర్మం చిట్లుతాది'' కంగారుగా అన్నాడు ఓబయ్య ఇటూ అటూ చూస్తూ. ''ఈడ యెవూరుండారని మనం మాట్లాడుకునేది ఇనడానికి. పెద్దూరు ఇంగా శానా దూరముండాదిలే చెప్పు'' తన పంతం వదల్లేదు రాజన్న.

''మరి మనమంతా పంచాయతీకి దేనికి''

''సాల్లేరా, పెద్దూరొచ్చేసింది'' గసిరాడు ఓబయ్య.

''ఎందుకా? ఈ విషయం అన్నిచోట్లా తెల యొద్దూ. మీ మామ ఎందుకంటే తప్పుజేసినోడు మీ కులపోడు. మీమామ ఈ ఊర్లో మీ కులపెద్ద. అందుకు'' గబగబా పూర్తిచేశాడు చెంచన్న.

పెద్దూరి ముందు చెంచన్న శాస్త్రి వీళ్లకి దూరంగా వెళ్లి మరో దారి గుండా ఊర్లోకి ప్రవేశించాడు.

★ ★ ★

కొరడా ఝుళిపించినట్లుగా ఎంత తీక్షణంగా ఉంది. రాయప్ప కచేరీ చేసే చిన్న బంగళా ముందటి మైదానంలో చెట్ల కింద అరుగుల మీద అందరూ గుంపులు గుంపులుగా కూర్చున్నారు.

ఓబయ్య మనుషులు వేపచెట్టు కింద నేలమీద కూర్చున్నారు.

బంగళా ముందున్న వసారా క్రింద కుడివైపు అరుగు మీద మునసబు, కరణం, ఇతర ఊరిపెద్దలు కూర్చున్నారు. ఎత్తుగా ఉన్న ఎడమ అరుగు ఖాళీగా ఉంది. అందరూ గొంతుకల్తో మాట్లాడు కుంటున్నారు.

కాస్సేపటికి నలుగురు మనుషులు సుంక య్యను నడిపించుకొచ్చి మైదానం మధ్యలో ఉన్న ఓ బండమీద నించో బెట్టారు. మొహం పాలిపోయి నీరసంగా కన్పిస్తున్నాడు. చొక్కా అక్కడక్కడా చిరిగి ఉంది. కాళ్ళు, చేతులు తాడుతో కట్టి ఉన్నాయి. సుంకయ్య ఓ నిముషం నిలబడి మోకాళ్ల మీద కూర్చున్నాడు.

క్రమంగా రాయప్ప ముఖ్య అనుచరులు కొండయ్య, ఎల్లారెడ్డి, నాగన్న, బంగారయ్య తదిత రులంతా ఒక్కొక్కరే వచ్చారు. ఓ కుర్రాడు మర చెంబుతో నీళ్ళు తెచ్చి ఎడమవైపు అరుగు మీద ఉంచి వెళ్లాడు. కాస్సేపటికి బంగళాలోపల కల కలం విన్పించగా అందరూ లేచి నిల్చున్నారు. అర వయ్యేళ్ళ రాయప్ప ఠీవిగా నడుచుకుంటూ వచ్చి పెద్ద అరుగు మీద కూర్చున్నాడు. తెల్లటి తెల్ల లాల్చీ, మెడలో పులిగోరు గొలుసు, ఎత్తుగా, తెల్లగా నిలువెల్లా దర్పంగా ఉన్నాడు. వెడల్పాటి మొహం, పెద్దకళ్ళు, మెలిదిరిగిన గుబురుమీసం, అక్కడ క్కడా మెరుస్తున్న వెంట్రుకలు, మొహం గంభీ రంగా ఉన్నా ప్రశాంతంగా ఉంది. అందరూ నమ స్కారాలు చేసి కూర్చున్నారు.

రాయప్ప అంతా ఒక్కసారి కలియజూసి సుంకయ్య మీద క్షణకాలం దృష్టి నిలిపి మునసబు వైపు సాలోచనగా చూశాడు.

మునసబు లేచి నుంచొని ''సుంకిగాడు అనబడే ఈ సుంకయ్య బద్వేలు తాలుకా పెద్దగూడెం నివాసి. మొదట్లో ఇతను చెప్పులు కుట్టేవాడు, తర్వాత తోళ్ల వ్యాపారం జేసినాడు. మొన్న ఎండాకాలంలో దొర వారి దగ్గర మామిడితోటల కాపును తీసుకున్న బద్వేలు వాస్తవ్యులు గఫూర్ సాయెబు నుంచి కొంత కాపును మారుబేరానికి కొని కాయలు అమ్ముకు న్నాడు. దొరగారికి కట్టాల్సిన మూడువేలకు బదులు రెండువేలే కట్టి వెయ్యిరూపాయలు ఎగ్గొట్టి పారిపోయాడు. రహస్యంగా ఈ దినం పొద్దున ఏటి దిగువ ముంగిపల్లి దగ్గర్లో తిరుగుతూండగా దొరగారి మనుషులు పట్టుకున్నారు. దొరగారి బాకీ ఎగ్గొట్టి పారిపోయినందుకు ఇతని మీద నేరం మోపబడింది. ఇతనికి తగిన శిక్ష వేయాలని మనవి'' అని క్లుప్తంగా ముగించి కూర్చున్నాడు.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. అందరూ దొర గారివైపు చూస్తున్నారు. రాయప్ప సుంకయ్య వైపు తీక్షణంగా చూసి ''నువ్వు చెప్పుకునేదేమైనా ఉందా?'' అడిగాడు గంభీరంగా.

సుంకయ్య కష్టమ్మీద లేచి నుంచొని ''దొరా నా పేరు సుంకిగాడు కాదు, సుంకయ్య'' అన్నాడు. రాయప్ప అనుచరులు గొల్లున నవ్వారు. అరుగు మీది పెద్దలు తత్తరపడి వారితో శృతి కలిపారు.

నవ్వులు క్రమంగా బలహీనపడుతూ మిగతా గుంపుల్లో వ్యాపించాయి. ఓబయ్య మనుషులు కృత్రిమంగా నవ్వి తన కర్తవ్యాన్ని నిర్వహించారు. రాజన్న నవ్వలేదు. చెంచన్నశాస్త్రి మూతికి తువ్వాలు అడ్డుండడం వల్ల అతను నవ్వాడో లేదో తెలియలేదు.

కరణం ముందుగా తేరుకుని ''నువ్వు చెప్పాల నుకున్నదేదో తొందరగా చెప్పు, సుంకయ్యా'' అన్నాడు.

నవ్వులకి దిగాలుబడ్డ సుంకయ్య మళ్లీ మొదలు పెట్టాడు.

''గఫూర్ సాయెబు నాకమ్మేటప్పుడు మూడు వేలకు మాట్లాడుకున్న మాట నిజమే దొరా. అయితే ఎనకాలొచ్చిన గాలివానకు శానాకాయలు రాలి పోయి దెబ్బతిన్నాయి. ఆ మాట చెబితే 'రెండు వేలీపో సుంకయ్యా సాలు కొండయ్యన్నకు నేజెబు తాలే' అన్నాడు సాయెబు. ఈ మాటే కొండయ్య న్నకు చెప్పినాను. నేనేం పారిపోలేదు. మాయింటి దానికి పానం బాగాలేకపోతే కడప పెద్దాసుపత్రికి తీసుకోని తొందర్లో బోవాల్సొచ్చింది దొరా''

''ఈడియన్నీ అపద్దాలు దొరా. రెండువేలిచ్చిన ప్పుడు ఇంగో వెయ్యి ఇయ్యాల్రా అని చెప్పినాను'' గట్టిగా అన్నాడు కొండయ్య.

''లేద్దొరా కొండయ్యన్నవే అపద్దాలు. నిన్న మాపటేలే యీళ్ళు నన్ను దొంగమాదిరి పట్టుకోని సావగొట్టి గొడ్డు మాదిరి తాళ్లతో గట్టేసి రేత్రంతా షెడ్లో బడేసినారు దొరా. ఇప్పుడు మునసబుగారు పొద్దున్నే నన్ను పట్టుకున్నట్లు జెబుతా ఉండారు. దొంగనైతే మల్లా ఈడికెందుకొస్తా దొరా. నేను జేసేది వుర్తి అయినా యాపారమైనా ఎవుణ్ణీ మోసం జేసేటోణ్ణి గాద్దొరా. పరువుగా బతకతా ఉండాను'' సుంకయ్య గొంతు పూడుకుపోయింది.

''యీడిదొక యాపారం ఈడికో మర్యాద. మర్యాదంటే దొరగారిది. వోరికి వెయ్యిరూపాయా లంటే బొట్టుతో సమానం. దాని కోసమా యీ పంచా యతి. దొరగారి మర్యాదకి ఇన్నాళ్లకి భంగమైంది. దొరా ఈడికి తగిన సిచ్చ యేసి మల్లా యెవుడూ ఇట్టాంటివి జెయ్యకుండా జూడాల''ఆవేశంగా ఇంకా ఏదో చెప్పబోయాడు ఎల్లారెడ్డి.

రాయప్ప ఓసారి తీక్షణంగా సుంకయ్యను చూసి సాలోచనగా మునసబు వైపు చూశాడు.

మునసబు కొంత తడబడి ''దొరగారు సుంక య్యను దోషిగా తేల్చారు. ఏం జెయ్యాలో నువ్వే జెప్ప కొండయ్యా'' అన్నాడు.

కొండయ్య ఓసారి వినయంగా రాయప్పకేసి చూసి ''వీడికి చొక్కా ఊడదీసి మెడలో మామిడికా యల దండ యేసి ఊరంతా తిప్పి పొలిమేర దాటించి వదిలేస్తే బాగుంటాది దొరా'' అన్నాడు.


ఒక్క క్షణం అందర్నీ నిశ్శబ్దం ఆవరించింది. రాజన్నలో కదలిక గమనించిన ఓబయ్య వెంటనే అతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

''దొరా ఇది శానా అన్నాయం. నేనట్టాటోన్ని గాద్దొరా. నేనిప్పటికే సగం జచ్చినాను. మల్లా మా ఊళ్ళో మొకం ఎట్టా జూపిచ్చాల. సచ్చిపోయేది మేలు. నెల గడువియ్యండి వెయ్యిరూపాయలు గడతాను. నన్ను వదిలేయండి దొరా'' అంటూ నేలమీద వాలిపోయాడు.

రాయప్ప లేచి ఎవరివైపూ చూడకుండా బంగ ళాలోకి వెళ్లిపోయాడు.

పంచాయతి అయిపోయింది. ఎక్కడివాళ్ళు అక్కడ వెళ్లిపోయారు. రాయప్ప అనుచరులు శిక్ష అమలుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

★ ★ ★



''యిదన్యాయం! అనలేకపోయినా కనీసం ఈ సారి కొదిలేయండి దొరా దయజూపి'' అనే ధైర్యం గలోడెవడూ మన పరగణాలోనే కనబడడురా'' నిర్వేదంగా అన్నాడు చెంచన్నశాస్త్రి తిరుగు ప్రయాణంలో.

''యే వూరైనా ఏ కాలమ్మైనా మా బతుకులంతే సాములూ'' అన్నాడు ఓబయ్య నిర్వికారంగా.

''అది అహంరా నాయనా అహం. చిన్నప్పట్నుంచి రాయప్ప డబ్బు అధికారం తిని పెరిగాడురా. వాళ్ల తాత ముత్తాతలూ అంతే. మనలాగా అందరి దగ్గరా చేతులు జాపే బతుకులకి తల తీసినా అవమానం ఉండదు. రాయప్ప మీద ఈగ వాలినా అవమానమే'' చెంచన్న నిట్టూర్చాడు. రాజన్న మౌనంగా నడుస్తున్నాడు.

ఆ పైన ఎవరూ మాట్లాడలేదు. దిగులుగా సాగిపోయాడు.

★ ★ ★

సుంకయ్య పంచాయతీ జరిగిన మూడునెలలకి ఓ రోజు సాయంకాలం హఠాత్తుగా గుడి మూసేసి ఇంట్లోకొచ్చి పడ్డ చెంచన్నను చూసి భార్య నాగమ్మ నోరెళ్లబెట్టింది. మనిషి ఆయాసపడుతూ గోడకి చేరగిలబడ్డాడు. సన్నగా వణుకుతున్నాడు.

''అదేమిటయ్యా! గుడికెళ్లిన వాడివి ఇలా ఉన్నట్లుండి వచ్చేశావు. ఒళ్ళు బాగాలేదా?'' ఆదుర్దాగా అడిగింది.

''ఒళ్ళు బాగా లేకపోవడం గాదే పిచ్చిదానా లోకమే ఏమో అయిపోతోందే'' అన్నాడు వగర్చుతూ.

కాస్సేపటికి తమాయించుకుని ''ఎంత ఉత్పాతం జరిగిందే, ఈరోజేం జరిగిందో తెలిస్తే నీ గుండె ఆగిపోతుంది. రాయప్పగారు చచ్చిబతికినంత పనయింది'' అన్నాడు.

''అయ్యో ఏమయిందండీ?'' ఆందోళన పడింది నాగమ్మ.

''చెప్తా, చెప్తా. చెప్పే ధైర్యమే ఇంకా రావడం లేదు. రాయప్ప పనిమీద కడపకు బోయి తిరిగొస్తూ ఈ రోజు పొద్దున్న బద్వేలులో ఆగాడంట. కొండయ్య వాళ్ళు ఏవో పనుల మీద బజారెళ్లారంట. ఉక్కగా ఉందని టౌన్‌క్లబ్ కాంపౌండ్‌లో చెట్టుకింద కుర్చీ వేయించుకుని కూర్చున్నాడంట. ఎవరో ఏదో మాట్లాడుతున్నారంట. ఇంతలో ఏమయిందో తెలుసా!''కాసేపాగి తనను తాను సంబాళించుకుని ''ఆ సుంకయ్య లేడూ, అదే ఆ మధ్య పంచాయతి చేసి చొక్కా విప్పి బండమీద ఊరేగించారూ, వాడేం జేశాడో తెలుసా? ఎక్కడినుంచొచ్చారో ఓ నలుగురు వాళ్ల వాళ్లను వెంటేసుకొచ్చి ఉన్నట్టుండి ఓ డబ్బాడు నల్లటి కందెన రాయప్ప మొహం మీద పోసి కుర్చీలోంచి తోసి ఛాతీమీద కాలుబెట్టి 'నీకొక్కడికేనేంరా పరువుండేది. ఇప్పుడు ఏమయిందిరా నీ పరువు, చచ్చేదాకా నీకీ నలుపు రంగు పోదురా'' అని తిట్టి వచ్చినవాళ్ళు వచ్చినట్టుగా గోడదూకి పారిపోయినారంట''

నాగమ్మ నోట మాట రాలేదు. నోరు తెరుచుకుని చూస్తూండిపోయింది.

''ఆ తర్వాత క్లబ్బులోని పెద్ద మనుషులంతా వచ్చి ఆయన్ని తీసుకుబోయి శుభ్రం జేయించేసరికి గంట పట్టిందంట. తర్వాత రాయప్ప మనుషులొచ్చి వాళ్లకోసం ఎంత వెతికించినా దొరకలేడంట. ఈ సాయంత్రమే రాయప్ప గారు ఊరుజేరి వెంటనే మిద్దెమీద గదిలోకెళ్లి తలుపు వేసుకున్నారంట. ఊరంతా గగ్గోలుగా ఉందంట ఎవరికేమి మూడుతుందోనని'' భయం భయంగా ముగించాడు శాస్త్రి.

''ఏంకాలం కలికాలం'' అంది నాగమ్మ.

''కలికాలమే. కాలం మారకుండా ఉంటుందా?'' అన్నాడు శాస్త్రి స్వగతంలా.

★ ★ ★

పదిహేను రోజుల తర్వాత ఓ సాయంకాలం గోధూళి వేళ పూజ ముగించి చెంచన్నశాస్త్రి పెద్దూరి నుంచి తిరిగొస్తున్న ఓబయ్య గుడి బయట కూర్చుని ఉన్నారు. శాస్త్రి వేపచెట్టు కింద చప్టామీద ఓబయ్య కింద ఓ బండమీద. ఓబయ్య చెబుతున్నాడు.

''బద్వేలులో అట్లా అయినరోజునుంచి రాయప్ప దొరగారు మిద్దెమీది నుంచి దిగలేదంట సాములూ''

చెంచన్న శాస్త్రి అందుకున్నాడు ''అవును ఓబయ్యా నేనూ విన్నాను జిల్లా కలెక్టరూ, పోలీసు సూపర్నెంటు, మినిష్టరు వచ్చి పరామర్శించి పోయారంట. పిల్లలు కూడా మద్రాసు నుంచి వచ్చి నాలుగురోజులుండి వెళ్లిపోయినారంట. అందర్తోనూ అట్లే ఉన్నాడంట. నోటమాట లేదు. ఎప్పుడూ ఆ కిటికీలో నుంచి కొండలకేసి చూస్తా ఉంటాడంట. కళ్ళు ఎర్రగా అయిపోయినాయంట''

''కొండయ్య, ఎల్లారెడ్డి, భూమయ్య ఈళ్లంతా మనుషుల్ని దళాలుగా తయారుచేసి బద్వేలు కాపక్క అన్ని ఊర్లలోనూ సుంకయ్య కోసం ఎతికిస్తా ఉండారంట. పెద్దగూడెం మొత్తం ఖాళీ చేసి కొండల్లోకి బోయినారంట అందరూ పిల్లాపాపల్తో గూడా'' ఓబయ్య అన్నాడు ఆందోళనగా.

''ఇంకా అక్కడెందుకుంటాడురా సుంకయ్య. పోలీసు పటాలమే ఒక వారం రోజులు పెద్ద గూడెంలో ఉందంట గదా వాడికోసం. వాడు, వాడి మనుషులు నైజాం రాజ్యంలోకి పారిపోయినారనుకుంటున్నారంతా''

''ఎవునికి ఎప్పుడు ఏమ్మూడుతుందో, ఎవుని ఇండ్లు తగలబెడతాయోనని జనం భయం భయంగా గడుపుతూ ఉండారు సాములూ'' అంటూ ఓబయ్య లేచి నిలబడి ''మాగూడా యేరే సమస్య వచ్చింది. మూణ్రోజులుగా నిద్దర్లేదు. ఇంగ ఎళ్తా సాములూ చీకటి బడింది ఆవులు ఇంటికి వచ్చేసుంటాయి'' అన్నాడు.

''మీకు వేరే సమస్య ఏమిటిదిరా'' అన్నాడు శాస్త్రి అరుగుదిగుతూ

''వాడే సాములూ మా రాజన్న పదైదు రోజుల్నుంచి కనబడ్డం లేదంట. మా చెల్లెలు పార్వతి మొన్న యీడికి మనిషిని బంపింది ఈడికేమన్నా వచ్చినాడేమోనని. ఈ సగం సదువచ్చిన పిల్లకాయల్తో ఇంతే సాములూ, అమ్మ నాయనా బాధ పడతాండారని కూడా ఉండదు. యాడ ఉండాడోయేమో''

చెంచన్నశాస్త్రి ఉలిక్కిపడ్డాడు. ''సరే నువ్వెళ్ళు ఓబయ్యా పురుగూ పుట్రా ఉంటాయి డొంకలో, చీకటి పడింది. రాజన్న స్నేహితుల్తో ఎక్కడో తిరుగుతూంటాడులే. వచ్చేస్తాడులే'' అంటూ గుడిలో పలికెళ్లాడు మళ్లీ పూజ చేయడానికి.

★ ★ ★

మరో పదిరోజులకి అంతటా వ్యాపించిన భయం మబ్బుల్లోంచి మెరుపు లేకుండా పిడుగులాంటి వార్త వచ్చింది.

ఆరోజు ఉదయమే ఇంకా తెల్లారకముందే చెంచన్నశాస్త్రి మడి కట్టుకుని బావి నుంచి బిందెతో నీళ్ళు గుడిలోకి తీసుకెళ్తున్నాడు. ప్రహరీ దగ్గరికొచ్చేసరికి దూరం నుంచి పరుగెత్తుకుంటూ రొప్పుతూ ఓబయ్య వచ్చి ఆయాసపడుతూ పక్కన నుంచున్నాడు. మొహంలో దిగ్భ్రాంతి. కాస్సేపయ్యాక కష్టం మీద చెప్పాడు, గసబెడుతూ.

''సాములూ, తెల్లార్జామున నాలుగ్గంటల కాడ రాయప్ప దొరగారు గుండె ఆగి సచ్చిపోయినారంట''

★

